# అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా గౌతమీ పూజారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. బాధ్యతలు చేపట్టిన ఆమెను కలెక్టర్ అభినందించారు. 2021 బ్యాచ్‌కు చెందిన గౌతమి మొదటిసారి పరీక్షలోనే 317 ర్యాంక్‌తో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆమెను జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డీఆర్‌డీఏ అధికారి మదన్‌మోహన్, మైనింగ్ అధికారి సైదులు, ఏవో గంగయ్య, డీపీఆర్‌వో దశరథం, మున్సిపల్ కమిషనర్ మీర్జా పసద్ ఆలీబేగ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**- రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ)**



బాధ్యతలు స్వీకరించిన గౌతమిని పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

## ప్రశ్నలు వేస్తూ.. పరిశీలిస్తూ!

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి శనివారం కొత్తపల్లి మండలం చింతకుంట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులను సిలబస్ గురించి అడిగి తెలుసుకుంటూ సైన్స్ సబ్జెక్టుల్లోని కొన్ని ప్రశ్నలు వేశారు. సమాధానం చెప్పలేని పిల్లలకు ఉదాహరణలతో జవాబులు వివరించారు. విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న పిల్లలను పలుకరిస్తూ మెనూ వివరాలు తెలుసుకున్నారు. బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు.

**- కొత్తపల్లి, డిసెంబరు 16**





గంభీరావుపేట మానేరు వాగుపై ప్రారంభమైన హైలెవల్ వంతెన నిర్మాణ పనులు

# ₹10.50 కోట్లతో హైలెవల్ వంతెన

**మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు షురూ ● కేటీఆర్ సహకారంతో నిధులు మంజూరు**

గంభీరావుపేట, డిసెంబర్ 16 : గంభీరావుపేట మండల కేంద్రంలోని మానేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎగువ మానేరు మత్తడి దుంకినప్పుడల్లా కిందనున్న లోలెవల్ వంతెన ఉప్పొంగుతూ తరచూ రవాణా వ్యవస్థకు అంతరాయం కలుగుతుండడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ హైలెవల్ వంతెనను మంజూరు చేశారు. దీని కోసం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ₹10.50 కోట్ల నిధులను మంజూరు చేయగా, ఈ యేడాది సెప్టెంబర్ 27న కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రావి కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. వాగుపై 9 పిల్లర్లు ఏర్పాటు చేసి 12.5 మీటర్ల వెడల్పు, 160 మీటర్ల పొడవుతో వంతెన నిర్మించనున్నట్లు ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాలవాంఛ నెరవేరుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణ పనులను మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ శనివారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన వచ్చే వానకాలం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలని గుత్తేదారులకు సర్పంచ్ సూచించారు.



కొండగట్టు అంజన్న ఆలయ క్యూలైన్లలో భక్తులు

# కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల, డిసెంబర్ 16: కొండగట్టు అంజన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే పుష్కరిణిలో స్నానం చేసి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ చైర్మన్ మారుతీస్వామీ, ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్ క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. భక్తులు ప్రధాన అంజన్న ఆలయంతోపాటు లక్ష్మి అమ్మవారు, వేంకటేశ్వరస్వామి, భేతాళస్వామి, మునిగుహలు, కొండలరాయుడి అడుగుల నమూనాలు, కోదండ రామాలయం, బొజ్జపోతన తదితర ఆధ్యాత్మిక ప్రదేశాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 15 వేల మంది దర్శించుకున్నారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆలయానికి రూ.5లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికార వర్గాలు వెల్లడించాయి.



రాయికల్: నిరసన చేపడుతున్న ఆటో కార్మికులు



సారంగాపూర్: బీర్‌పూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఆటో, టాక్సీ డ్రైవర్లు

# ఆటో కార్మికుల ఆందోళన

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిరసనలు
- జీవనోపాధి చూపాలని డిమాండ్

సారంగాపూర్/ రాయికల్/ కొడిమ్యాల/ వేములవాడరూరల్, డిసెంబర్ 16 : ఆటో కార్మికులు తమకు జీవనోపాధి చూపాలని శనివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ అధ్యక్షుడు బత్తుల దేవరాజు, నాయకుల సలీం, కమలాకర్, పాషా, 100 మంది ఆటో కార్మికులు ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి వేములవాడ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. రాయికల్ పట్టణంలో జగిత్యాల డీజిల్ ఆటో సంక్షేమ సంఘం అధ్యక్షుడు శెట్టి శ్రీనివాస్, ఆటో డీజిల్ సంఘం జగిత్యాల జనరల్ సెక్రెటరీ ఆర్మల్ల శ్రీనివాస్, రాయికల్ మండలాధ్యక్షుడు సామల్ల ప్రసాద్, యూనియన్ నాయకులు, రాయికల్ ఆటో, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లు ఆందోళన చేశారు. కాగా, వీరికి సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో లక్ష్మీ నరసింహ ఆటో, జీప్, టాక్స్ యూనియన్ ప్రెసిడెంట్ తిరుమల రాజేందర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ఆటో, టాక్సీ, జీపు డ్రైవర్లు ధర్నా చేశారు. కొడిమ్యాలలో ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు పర్లపెల్లి జలేందర్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన, ర్యాలీ తీశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి అంగడి బజార్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం దాకా ఆటోలతో ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వీరికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు పలికారు.



వేములవాడ రూరల్ : తిప్పాపూర్ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

# వంటగ్యాస్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- తెలంగాణ ఎల్‌పీజీ డీలర్ల ప్రాంతీయ సమావేశంలో సంఘం అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 16: వంటగ్యాస్ డీలర్ల సమస్యల పరిష్కారానికి టీడీఎల్‌ఏ నిరంతరాయంగా కృషి చేస్తున్నదని తెలంగాణ ఎల్‌పీజీ డీలర్ల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో శనివారం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతి త్వరలోనే డెలివరీ సిబ్బంది, మెకానిక్, మాండేటరీ తనిఖీ చేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి సెట్విన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నదని తెలిపారు. సెట్విన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువతకు ప్రాధాన్యం ఇచ్చి, వారికి శిక్షణతోపాటు సర్టిఫికేట్ ఇవ్వడంతో క్షేత్ర స్థాయిలో ఎల్‌పీజీ సేవలు పొందుతామని తెలిపారు. రూ.500 కే ఇచ్చే సిలిండర్‌పై ప్రభుత్వం ఇంకా విధివిధానాలు రూపొందించలేదని చెప్పారు. ఈకేవైసీని కస్టమర్లు మొబైల్ యాప్ ద్వారా నిర్వహించుకోవచ్చన్నారు. టీడీఎల్‌ఏ ప్రధాన కార్యదర్శి శ్రీచరణ్ మాట్లాడుతూ, పౌరసరాఫరా శాఖ ద్వారా ఏటా పొందే లైసెన్స్‌ను జీవితకాల లైసెన్స్‌గా మార్చేందుకు సంఘం కృషి చేసిందని తెలిపారు. డీలర్లు ఎల్‌పీజీ వ్యాపారాన్ని సక్రమంగా నిర్వహించడానికి వీలుగా ఆయిల్ కంపెనీల మార్గదర్శకాలు పాటించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్ర పూర్వ ఎల్‌పీజీ ప్రధాన కార్యదర్శి పీవీ మదన్‌మోహన్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి సిలిండర్లపై రాయితీలు పెంచే ఆలోచన ఉన్నందున, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు డీలర్లు చొరవ చూపాలని కోరారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఎల్‌పీజీ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇక్కడ కోశాధికారి ఐలా రెడ్డి, రాష్ట్ర బాధ్యులు హరికృష్ణ, నాయుడు, సురేందర్, సతీశ్, రవీందర్ నీలా, వెంకటరెడ్డి, సతీశ్, ప్రవీణ్, రాంరెడ్డి, మోర్తాడ్ సీను, ఆర్ వెంకటరెడ్డి, అగర్వాల్, బుజ్జ, వెంగళ రావు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.